గౌసుద్దీన్ మొఖం నిప్పుల పెనంలా అవమానంతో కుతకుతలాడిపోతోంది. అతనికింకా తెలీదు. అతని ఇంటిలో దొంగతనం చేయించింది యుగంధరేనని.

సరిగ్గా వాళ్ళు కూర్చున్న అయిదు నిముషాలకు వచ్చాడు ఐ.జి. దొర.

ఇద్దరూ లేచి సెల్యూట్ చేశారు.

"వెల్... మీ ఇద్దరిలో ఎవరన్నది ఇప్పుడు డిసైడ్ చేయాలి అంతేగా? కూర్చోండి" అన్నాడు తన సీట్లో కూర్చుంటూ.

మరలా హాలు నిశ్శబ్దంలో మునిగిపోయింది.

అంతలో ఓ పోలీస్ కానిస్టేబుల్ పర్మిషన్ తీసుకుని ఐ.జి.దొర దగ్గరకు వచ్చి ఆ రోజు ఈవెనింగ్ డైలీ అందించాడు. అది చూసిన గౌసుద్దీన్ ముఖంలో కళ తప్పిపోయింది.

ఫ్రంట్ పేజీలో తాటికాయంత అక్షరాల్లో ఎ.ఎస్.పి. ఇంట్లోనే దొంగతనం అనే హెడ్డింగ్ చూసి ఐ.జి. దొర అశ్చర్యపోయాడు.

తరువాత ఒకింత అవమానంగా భావించాడు. ఆ వెంటనే గౌసుద్దీన్ వేపు చూశాడు. ఆ చూపులు తూటాల్లా వున్నాయి.

అంతలోనే ఫోన్ మ్రోగింది. ఐ.జి.దొర ఫోన్ ఎత్తి కొద్దిక్షణాలు చెవి దగ్గర ఆనించుకుని ఆ తరువాత విసురుగా దాన్ని క్రెడిల్ చేశాడు.

"మిస్టర్ గౌసుద్దీన్ యూ ఆర్ హేవింగ్ లాటాఫ్ ఇన్ఫ్లుయన్స్--రేదర్ దేన్‌మీ...యామ్ ఐ రైట్..." సర్‌కాస్టిగా అన్నాడు ఐ.జి.

గౌసుద్దీన్ ముఖం నెత్తురు చుక్క లేనంతగా పాలిపోయింది.

"మిస్టర్ గౌస్...మనకు కావల్సింది నీతి, నిజాయితీ, ధైర్యం. అంతేకాని రాజకీయాలు, లంచగొండితనం కాదు. నీ దృష్టిని నీ వృత్తి పై పెట్టు పైకొస్తావ్. అనవసరంగా రాజకీయాలకు తగలేయకు, అందులోనే కూరుకుపోయి నాశనమైపోతావు. నువ్వు శాంతిభద్రతలు కాపాడగలవని ఎవరయినా విశ్వసిస్తారా?

నీ ఇంట్లోనే పట్టపగలే దొంగతనం జరిగింది. జరిగి అప్పుడే ఆరు గంటలయింది. ఇంతవరకు ఏ మాత్రం ఆచూకీ తీయలేకపోయావ్.

సమర్ధుడిగా రుజువు చేసుకోవాల్సిన కాలాన్ని ఇతరుల్ని ఇన్ఫ్లుయన్స్ చేయటానికి ఉపయోగిస్తున్నావు. ఇట్ ఈజ్ వెరీ బాడ్ ఆన్ యువర్ పార్ట్..." అని యుగంధర్ వేపు తిరిగి "సిద్దంగా వుండు యుగంధర్, రేపు ఉదయానికే నీకు పోస్టింగ్ ఆర్డర్స్ వస్తాయి" అంటూ లేచి వెళ్ళాడు ఐ.జీ.

అవమాన భారంతో లేచాడు గౌసుద్దీన్ . యుగంధర్ తృప్తిగా బయటకు నడిచాడు.

0 0 0

సరిగ్గా అక్కడ జగ్గీ పేరుమీద ఫైనాన్స్ కంపెనీ ప్రారంభోత్సవం- యుగంధర్ చార్జ్ తీసుకునే రోజు ఒక్కటే.

జాయినింగ్ రిపోర్టు ఇచ్చి తన అఫీసుకు వచ్చి సీట్లో కూర్చోగానే టేబుల్‌పై కనిపించింది ఫైనాన్స్ కంపెనీ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక. కేజువల్‌గా దాన్ని ఓపెన్ చేశాడు.

మధ్య తరగతి మానవుల తీరని ఆశలకు రెక్కలు కల్పించే సౌభాగ్యలక్ష్మి సగటు మనిషి ఆశాసౌధాలకు ఆసరా కల్పించే అనంతలక్ష్మి. త్వరపడండిది... ఏమో!!! మారుతీ మీదే కావచ్చేమో.... ఇన్విటేషన్ కార్డుపై మూడు లైన్లు ఆకర్షణీయంగా వున్నాయి.

క్రింద ప్రారంభోత్సవం గౌరవనీయ మంత్రివర్యులు శ్రీ పట్టాభి అని వుంది.

పట్టాభి రాష్ట్ర రాజకీయాలలో పదునైన మనిషి, మంత్రి అయి పట్టుమని పదిరోజులు కాకముందే పదిమందిని హతం చేయించిన పెద్ద మనిషి.

ఎక్కడ ఏ మీట నొక్కితే అధికారం కదులుతుందో ఎక్కడ ఏ ఎత్తు వేస్తే ఎవరు చిత్తవుతారో బాగా తెలుసుకున్న మనిషి.

గతరాత్రే తను ఇక్కడకు వస్తుండగా ఐ.జి దొర ఇచ్చిన ఫైల్ క్షుణ్ణంగా చదివాడు తను.

అందులో మరో పేరు కనిపించింది. మధుమూర్తి .

ఆలోచనల్నుంచి తేరుకుని కార్డుని తిరిగి చూశాడు. ఆ రోజే మధ్యాహ్నం 1-40 నిమిషాలకు ఫైనాన్స్ కంపెనీ ఓపెనింగ్. ఖచ్చితంగా అది ప్రజల్ని మోసగించబోయే కంపెనీయే...

అనుమానం వచ్చి బెల్ నొక్కాడు. అప్పటికే పోలీస్ వింగ్‌లో యుగంధర్ గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. యుగంధర్ నిప్పులాంటివాడని... నీతి నిజాయితీలంటే ప్రాణాలిస్తాడని ఐ.జి దొర అతనికి ఏ.ఎస్.పి. నుంచి ఎస్.పిగా ప్రమోషన్ ఇస్తూ ఇక్కడకు పోస్టింగ్ ఇచ్చినట్లుగా అందరూ చెప్పుకుంటున్నారు.

పి.ఏ. వచ్చి వినయంగా తలవంచి "సార్" అన్నాడు.

"ఈ ఇన్విటేషన్ కార్డు చూశారా?" యుగంధర్ ప్రశ్నకు కాక సంబోధనకు పి.ఏ. ఉలిక్కిపడ్డాడు.

పోలీసు వ్యవస్థలో సబార్డినేట్స్‌ని గౌరవించడం అనేది ఎప్పుడూ లేదు. తన క్రిందవారిని కుక్కకంటే హీనంగా చూసే బ్రిటిష్ ఆర్డర్లీ బానిస వ్యవస్థకు పోలీస్ వ్యవస్థ గొప్ప ఉదాహరణ.

అలాంటి వ్యవస్థకి ప్రతినిధి అయిన ఈ ఎస్.పి తనను చూశావా అనే బదులు చూశారా అని ప్రశ్నించటం ఆశ్చర్యంగా వుంది అతనికి.

"చూశాను సార్" పి.ఏ. తనలో కలిగిన ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుకుంటూ జవాబిచ్చాడు.

"మరి బందోబస్తు ఏర్పాట్లు చేశారా? అందులో మంత్రిగారొస్తున్నారు"

ఎస్.పి. తన విద్యు క్తధర్మాన్ని నిర్వహించే పద్ధతిలోనే అడిగాడు.

యుగంధర్‌కి ఇప్పుడా నగరంలోని పోలీస్ శాఖకు చెందిన వ్యక్తులపై అంతగా అవగాహన లేదు. ఎవరు పట్టాభి మనుషులో, ఎవరు వృత్తి ధర్మానికి కట్టుపడ్డారో తెలుసుకునేందుకు కొంత సమయం పడుతుంది. అప్పటివరకూ ప్రతి ఒక్కరితో జాగ్రత్తగా మసలుకోవాలని ఆ నగరానికి వస్తూనే మనస్సులో అనుకున్నాడు.

"చేశాం సార్..." పి.ఏ వినయంగా జవాబు ఇచ్చాడు.

"అది ఎవరి జ్యూరిస్‌డిక్షన్"

"సి.ఐ. రవీంద్రగారి జూరిస్ డిక్షన్ కిందకొస్తుంది సార్"

"ఇప్పుడతను ఎక్కడ?"

"అక్కడికి ఈపాటికి వెళ్ళిపోయి వుంటారు"

యుగంధర్ కొద్ది క్షణాలు మౌనంగా వున్నాడు.

"ఓ.కె. మంత్రిగారొచ్చేముందు నాకు తెలియజేయండి. యు మే గో,"

పి.ఏ. వెళ్ళిపోయాక ఆలోచిస్తూ కూర్చున్నాడు యుగంధర్. ఈ పాటికి పట్టాభికి తను ఇక్కడికి వచ్చినట్లు తెలిసిపోయే వుంటుంది. వీలయినంత త్వరలో తనను తన వేపుకు త్రిప్పుకునే ప్రయత్నం చేస్తాడు.

అది సాధ్యంకాదని తెలిసినప్పుడు తనను ఇక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ చేయించే ప్రయత్నమన్నా చేస్తాడు. తప్పదు. పరోక్ష యుద్ధం తప్పదు. సిటీ పోలీస్‌మేప్ తెప్పించి పరిశీలనగా దానివేపే చూస్తూ వుండి పోయాడు.

సాధారణంగా నగరాన్ని సర్వే డిపార్టుమెంట్ వారితో మేప్ గీయించుకుని అందులో ఏ పోలీస్‌స్టేషన్ ఎక్కడ వుంది మార్క్ చేసుకుని దాని పరిధిని రెడ్‌లైన్‌తో మార్క్ చేయిస్తారు. అ తరువాత రోడ్స్‌ని గుర్తిస్తారు.

పబ్లిక్ ప్లేసెస్ గుర్తిస్తారు. గొడవలు జరగటానికి వీలు కలిగించే ఇరుకు ప్రదేశాలకు, సందుల్ని,కార్నర్‌ప్లేసెస్‌ని అదేమేప్‌లో మార్క్ చేస్తారు.

ఏదయినా గొడవ జరిగిందని ఇన్‌ఫర్‌మేషన్ వచ్చిన మరుక్షణం పోలీస్‌ఫోర్స్ ఎంత టైంలో అక్కడకు చేరగలదు? ఏఏ ప్రాంతానికి ఎవరు దాదా? అతని క్రింద ఎంతమందున్నారు? వారికి వత్తాసుగా వున్న వ్యక్తులెవరు? పార్టీ ఏది?

సాధరణంగా క్రిమినల్స్ ఆ నగరంలో వాడగల మారణాయుధాలు ఎలాంటివి? చాకులా? చాకులయితే వాటిని తయారుచేసే ఖార్ఖానాలు ఎక్కడున్నాయి, వాటి యజమానులు ఎవరు? దెబ్బతిన్న వ్యక్తుల్ని రక్షించేందుకు అందుబాటులోవున్న ప్రభుత్వ ఆసుపత్రులు ఎంత దూరంలో వున్నాయి?

జూదం, వ్యభిచారం, అరక్, మాదకద్రవ్యాలు, బ్రాకెట్ బిజినెస్‌లు నడిచే కేంద్రాలెక్కడ? వాటి అధిపతులెవ్వరు? వాళ్ళు బ్యాగ్రవుండ్ ఏమిటి? వాళ్ళ మీద ఆల్‌రెడి చార్జిషీట్ ఫైలయిందా? లేదా? ఒకవేళ అంతవరకు చార్జిషీట్ ఫైల్ కాకుంటే వార్ని

అనుమానం కింద అదుపులోకి తీసుకోవటం ఒకింత కష్టం గావచ్చు. ఆల్‌రడీ వుంటే అనుమానం క్రింద అదుపులోకి తీసుకునేందుకు చట్టపరంగా సౌలభ్యం ఎక్కువ. సాధారణంగా కొత్తగా చార్జి తీసుకునే ప్రతి పోలీసాఫీసరు ఇలాంటివి క్షుణ్ణంగా పరిశీలిస్తాడు.

ఇప్పుడదే చేస్తున్నాడు యుగంధర్, ముందు సమగ్రంగా ఆ నగరాన్ని ఆకళింపు చేసుకుంటే అదుపులోకి తీసుకోవడం సులభం.

నిజంగా ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగకుండా చిత్తశుద్ధితో పోలీస్‌సిబ్బంది తమ వృత్తిధర్మాన్ని నిర్వహిస్తే శాంతిభద్రతల పరిరక్షణ  కష్టసాధ్యమేం కాదు.

0 0 0

ఉదయ్, సర్కిల్ సిటీలో దిగారు. సర్కిల్ ఉదయ్‌కిచ్చిన మాట ప్రకారం ఇంటి అడ్రస్ తెలియచెప్పాలి. అప్పటికే అందుకోసం నియమించిన వ్యక్తులను కలిస్తే ఎంతవరకొచ్చింది తెలియవచ్చు.

ఒకరోజు గడువిచ్చి ఉదయ్ టీబంక్ వేపు సాగిపోయాడు. అతనికిప్పుడు మొదటిసమస్యకు రెండోసమస్య తోడయింది. ఏదో ఒకపని చేయకపోతే గడవడం చాలా కష్టమైపోతుంది.

ఎలా? ఏం పని చేయాలి? అసలు తనకి పని దొరుకుతుందా? ఆలోచనలు అతని మెదడు వేడెక్కి పోయింది. ఉదయ్‌ని దూరంనుంచే గుర్తించాడు బంక్ యజమాని.

ఎందుకో తెలీదు. ప్రత్యేక కారణం లేదుకాని ఆ బంక్ యజమానికి ఉదయ్ అంటే అభిమానం. ఉదయ్ తన సహజ ధోరణిలోనే ఓక గ్లాస్ చల్లటినీళ్ళు  గటగటా తాగేసి ఒకింత సేద దీరి బంక్ యజమానివేపు చూశాడు.

అతను వెంటనే వెన్న రాసిన రెండు రొట్టెలు తెచ్చి ఉదయ్‌ముందు పెట్టాడు. అంతలో ఓ వ్యాన్ అటు వచ్చింది. వ్యాన్‌కి ఆ రోజే ప్రారంభిస్తున్న ఫైనాన్స్ పథకాలు రాసివున్న బ్యానర్సు కట్టి వున్నాయి.

వ్యాన్ స్లోగా ముందుకు సాగిపోయింది.

"మీ అవసరాలకు ఆసరా కల్పించే అమూల్యావకాశం ఈరోజే మీ ముందుకు రాబోతుంది త్వరపడండి. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. ఏమో! మారుతి మీకే రావచ్చేమో! వచ్చే సంవత్సరానికి మీరు మీ కొత్తయింట్లో పాలు పొంగించుకోవచ్చునేమో? ఎవరు చెప్పగలరు? రిజర్వ్‌బ్యాంకు గ్యారంటితో మంత్రి పట్టాభిగారి సువర్ణ హస్తాలతో ప్రారంభం కాబోతున్న ప్రతిష్టాత్మకమైన ప్రయివేట్ ఆర్థిక సంస్థ"

వ్యాన్ క్రమంగా దూరమైపోయింది. దారి పొడువునా పాంప్లెట్స్ చల్లబడ్డాయి.

ఉషకి ఆ ఫైనాన్స్ గురించి అనుమానంగా వుంది. తన అనుమానానికి ఆధారాలు సం

పాదించాలంటే రిస్క్ చేయాలి. అది రెసిడెంట్ ఎడిటర్‌కి తెలీకుండా చేయాలి.

తన సిక్త్‌సెన్స్‌లాంటి నమ్మకం లేదు కాని మోసగాళ్ళ ట్రిక్స్‌పై అవగాహన వుంది. ఆమె ఇన్విటేషన్ కార్డు తీసుకుని లేచింది. ఆమె వెనుకే స్టాఫ్ ఫోటోగ్రాఫర్ రమేష్ తన కేమేరా కిట్ సర్దుకుని లేచాడు.

0 0 0